సాక్షి మెదక్

గురువారం । 30 । నవంబర్ । 2023



ఓటరన్నా.. మేలుకో..

ఓటరన్నా మేలుకో.. నీ తల రాత మారాలంటే ఓటే సరైన మార్గం. నువ్వువేసే ఓటు నీ తల రాతతో పాటు చుట్టూ ఉన్నవారి భవితతవ్యం నెలకొంది. వివరాలు 8లో ▸



పోలింగ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి

టోప్యాతండాలో ఎంపీ ఎన్నికల సమయానికి పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ ముసాద్దిక్ అన్నారు. వివరాలు 9లో ▸



తడిసిన ధాన్యం

నర్సాపూర్ మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాలు, కల్లాల వద్ద రైతులు ఆరబోసుకున్న ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ ఫామ్‌హౌస్ తనిఖీ

- డబ్బు దాచారనే సమాచారం
- ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

చిన్నశంకరంపేట/రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఫామ్‌హౌస్, గెస్ట్‌హౌస్‌లను పోలీసులు, ఎన్నికల వ్యయ పరిశీలకులు తనిఖీ చేశారు. నార్సింగి మండలం జప్తిశివనూర్ గ్రామశివారులో ఆయనకు చెందిన ఫామ్‌హౌస్‌లో డబ్బు దాచారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శని బుధవారం తెలిపారు. సమాచారం అందుకున్న ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులు తనిఖీ చేసేందుకు వెళ్లగా ఫామ్‌హౌస్ వాచ్‌మేన్ కుటుంబ సభ్యులు మాత్రమే ఉన్నారని, దీంతో వారిని అడిగి ఫామ్‌హౌస్‌లోని గదులు, బీరువాలను తనిఖీ చేయగా ఎలాంటి డబ్బులు లభించలేదన్నారు. అదే విధంగా గెస్ట్ హౌస్‌లో కూడా తనిఖీలు నిర్వహించారు. షబ్బీర్ అలీ నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు రేంత్‌రెడ్డి పోటీలో ఉన్నారు. కామారెడ్డి నియోజవర్గం రాజకీయాలను షబ్బీర్ అలీ ఇదే ఫామ్‌హౌస్ నుంచి పర్యవేక్షించే వారు.

మహిళా మోడల్ పోలింగ్ కేంద్రంగా.. వెల్మకన్న

ఏడీఆర్‌డీఓ భీమయ్య



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న భీమయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్న పోలింగ్ కేంద్రాన్ని మహిళా మోడల్ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేశారని ఏడీఆర్‌డీఓ భీమయ్య తెలిపారు. బుధవారం ఆయన అక్కడ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. హెల్ప్‌డెస్క్, క్యూలైన్, సెల్ఫీ పాయింట్ ఇతర సౌకర్యాలు కల్పించడంతోపాటు కేంద్రాన్ని అందంగా, ఆకర్షణీయంగా సిద్ధం చేయాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయన వెంట డీపీఎం మోహన్, ఏపీఎం సంగమేశ్వర్, సీసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, బీఎల్‌ఓ ప్రవళిక పాల్గొన్నారు.

బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే.. బంధువుల ఆరోపణ
- మెదక్- చేగుంట రహదారిపై ఆందోళన



మృతి చెందిన బాలింత

మెదక్ కలెక్టరేట్: మెదక్ మాతాశిశు సంరక్షణ ఆరోగ్యం కేంద్రంలో దారుణం చోటుచేసుకుంది. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన మహిళ ఒక్కసారిగా అస్వస్థతకు గురికాగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. దీంతో బాలింత మృతికి వైద్యుల నిర్లక్ష్యమేనని ఆరోపిస్తూ బంధువులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. పాపన్న పేట మండలం కొడపాకకు చెందిన సుతారి రేణుక(29) పురిటి నొప్పులతో బాధపడుతుండగా ఆమె తల్లిదండ్రులు ప్రసవం కోసం మెదక్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి మంగళవారం సాయంత్రం తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు నార్మల్ డెలివరీ చేయగా బాబు జన్మించాడు. ప్రసవం తర్వాత బాలింతకు తీవ్ర రక్తస్రావం జరగడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గ్రహించిన వైద్యులు రాత్రి 3 గంటల ప్రాంతంలో గాంధీ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. వాహనంలో అక్కడికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే రేణుక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నార్మల్ డెలివరీ తర్వాత రక్త స్రావం కావడంపై వారు అనుమానం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే రేణుక మృతి చెందిందని ఆరోపిస్తూ మెదక్ – చేగుంట ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. బాలింత మృతిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా వైద్యులు అందుబాటులోకి రాలేదు. కుటుంభ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ పోచయ్య తెలిపారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న బంధువులు

ఓటింగ్‌కు రెడీ

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- జిల్లాలో ఓటర్లు 4,40,341
- పోలింగ్ కేంద్రాలు 579
- మహిళలకు 10, దివ్యాంగులకు 2
- తరలిన ఎన్నికల సిబ్బంది
- ఉదయం 7 నుంచి 5 వరకు పోలింగ్



బాలుర కళాశాల నుంచి ఎన్నికల సామగ్రితో తరలివెళుతున్న సిబ్బంది

మెదక్: ఎన్నికల ఏర్పాట్లకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అందులో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్, సెక్టోరియల్, మైక్రో అబ్జర్వర్లు, రూటు అధికారులను నియమించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది బుధవారం ఈవీఎం, వీవీ ప్యాడ్స్, కంట్రోల్ యూనిట్లను తీసుకుని వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. అయితే 58 రూట్లుగా విభజించిన అధికారులు ఇప్పటికే ఎన్నికల సామగ్రిని ఆయా కేంద్రాలకు తరలించారు. ఈవీఎం ప్యాడ్‌లను మెదక్ జూనియర్ కళాశాల, నర్సాపూర్ బీఆర్‌ఐటీ కళాశాలలో ఉంచగా వాటిని సిబ్బంది తీసుకువెళ్లారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆ రెండు సెంటర్లను సందర్శించి సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, 30 ఉదయం 6 గంటలకు ఆయా పార్టీల ఏజెంట్లతో మాక్‌పోలింగ్ నిర్వహించి 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో 4,40,341 మంది ఓటర్లు

మెదక్, నర్సాపూర్ రెండు నియోజక నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 4,40,341 మంది ఓటర్లు ఉన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 2,23,593 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,09,240, మహిళా ఓటర్లు 1,14,346, థర్డ్ జెండర్ ఏడుగురు ఉన్నారు. అలాగే మెదక్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 2,16,748. అందులో పురుష ఓటర్లు 1,03,654 కాగా మహిళా ఓటర్లు 1,13,089, థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారు.

579 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలోని మొత్తం 579 పోలింగ్ కేద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో మెదక్‌లో 275 పోలింగ్ కేంద్రాలు ఉండగా నర్సాపూర్ నియోజకవర్గంలో 304 ఉన్నాయి. వాటిలో అర్బన్ ప్రాంతంలో 65 పోలింగ్ కేంద్రాలు కాగా రూరల్ ఏరియాలో 514 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 10 మహిళా పోలింగ్ కేంద్రాలు, వాటిలో నర్సాపూర్‌లో 5, మెదక్‌లో 5 సిద్ధం చేశారు. నర్సాపూర్‌లో 5, మెదక్‌లో 5 మోడ్రన్ పోలింగ్ కేంద్రాలను, అలాగే దివ్యాంగులకు ప్రత్యేకంగా 2 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. కాగా వాటిలో మహిళా పోలింగ్ కేంద్రాల్లో మహిళా సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తారు. దివ్యాంగుల పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులైన సిబ్బంది విధులు నిర్వహిస్తారు. మోడ్రన్ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు, మరుగుదొడ్లు, బాత్‌రూములతో పాటు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లలో దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్లను అందుబాటులో ఉంచారు. వారు లోనికి వెళ్లడానికి వీలుగా ర్యాంపులు కూడా ఏర్పాటు చేశారు.

2035 మంది సిబ్బంది

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లోను 2,035 మంది సిబ్బందిని నియమించారు. అందులో 579 మంది ప్రిసైడింగ్ అధికారులు, 579 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 58 మంది సెక్టోరియల్ అధికారులు, 58 మంది రూటు అధికారులు, 428 మంది వెబ్‌కాస్టింగ్, 133 మైక్రోఅబ్జర్వర్లతో పాటు అధనంగా మరో 200 మంది సిబ్బందిని నియమించారు.

పటిష్ట భద్రత

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చేటుచేసుకోకుండా 144 సెక్షన్ విధించారు. ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో అమల్లో ఉంటుందని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పటిష్టమైన భద్రత కోసం పక్క రాష్ట్రాల నుంచి అదనంగా పోలీస్ బలగాలను కూడా దింపారు. జిల్లాలో మొత్తం 500 పైచిలుకు పోలీస్‌లను బందోబస్తుకు నియమించారు. ఎన్నికలు ముగిసే వరకు పోలింగ్ బూత్‌లకు 100 మీటర్ల దూరం వరకు ఎవరూ రావద్దని, పోలింగ్ బూత్ సమీపంలో ఐదుగురు సభ్యులకు మించి ఎవరూ గుమికూడవద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరుగనుండగా పోలింగ్ బూత్‌ల ముందు క్యూలో నిలబడిన వారందరూ తమ ఓటుహక్కు వినియోగించుకునే వరకు పోలింగ్ జరుగుతుందని సంబంధిత జిల్లా అధికారులు తెలిపారు.



మీడియా సెంటర్ పరిశీలనలో కలెక్టర్ రాజర్షిషా

వంద శాతం ఓటింగే లక్ష్యం

- యువత ప్రజాస్వామ్యానికి పునాది
- స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: నేటి ఎన్నికల్లో జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఎపిక్ కార్డులు పంపిణీ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వందశాతం ఓటింగ్ లక్ష్యంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతి లేదన్నారు. ప్రపంచంలో మనదేశంలోనే ఎక్కువ యువత ఉందని, నూతన యువ ఓటర్లు దేశానికి, ప్రజాస్వామ్యానికి పునాది వంటి వారని పేర్కొన్నారు. ఓటు అమ్ముకోవడం నేరమని; డబ్బు, మద్యం, ఏదైనా వస్తువుల పంపిణీ జరిగితే సి విజిల్ యాప్‌లో ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఓటుహక్కు వినియోగించుకొనేందుకు ఫోటోతో ఉన్న 13 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదైనా పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌ను సందర్శించి సీసీ కెమెరాలు, చెక్‌పోస్టుల వద్ద అధికారుల పనితీరును పరిశీలించారు.

ఇద్దరు ఉద్యోగులపై వేటు

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్చారం మండలం పైతర గ్రామంలోని నీటి సరఫరాచేసే ఉద్యోగి బట్ట జీవయ్య నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీలోచేరి ఎన్నికల ప్రచారం చేస్తూ విధులను నిర్లక్ష్యం చేస్తున్నట్లు సీ విజిల్‌లో ఫిర్యాదు వచ్చిందని పేర్కొన్నారు. ఈ విషయమై విచారణ చేపట్టగా నిజమేనని తేలడంతో అతడిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అలాగే మాసాయిపేట మండలంలోని పశువర్ధకశాఖ ప్రాథమిక కేంద్రంలో పనిచేస్తున్న అటెండర్ విద్యాసాగర్‌ను సస్పెండ్ చేశామని తెలిపారు. ఆయన నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు వచ్చిన వీడియో రికార్డ్ ఆధారంగా ఫిర్యాదు వచ్చిందని, విచారణ చేపట్టగా నిజమని తేలడంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. అధికారులు ఎన్నికల విధులలో నిర్లక్ష్యంచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ చర్యలు



ఈవీఎంల పంపిణీ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారులు

- ప్రతి బస్సుకు జీపీఎస్ ట్రాకింగ్
- కేటాయించిన ప్రాంతాల్లోనే అధికారులు బస చేయాలి
- జిల్లా ఎన్నికల పరిశీలకులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో నేటి ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్, జిల్లా పోలీస్ పరిశీలకుడు సంజయ్ కుమార్ తుకారాం, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా తెలిపారు. బుధవారం మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ఈవీఎం యంత్రాల పంపిణీ కేంద్రాలను వారు పరిశీలించి పోలింగ్ సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలింగ్ అధికారులు ఈవీఎం యంత్రాలను, పోలింగ్ సామగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం సరిచూసుకుని, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. వారు వెళ్లే ప్రతి బస్సుకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేశామని, తిరిగి రిసెప్షన్ కేంద్రాలకు వచ్చిన తరువాత క్లోజ్డ్ కంటైనర్ల ద్వారా స్ట్రాంగ్ రూమ్‌లకు జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా తరలిస్తామని చెప్పారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలలోనే బస చేయాలని ఆదేశించారు. ఓటు గోప్యతకు అనుగుణంగా పోలింగ్ కేంద్రంలో కంపార్ట్‌మెంట్, సిబ్బంది ఏజెంట్లు కూర్చునే విధంగా సిట్టింగ్ ఏర్పాటు చేసుకొని అవసరమైన ఫారాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్‌ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి క్లియర్ చేయాలని సూచించారు. పోలింగ్‌కు సంబంధించి ఓటింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తూ ఎటువంటి చిన్న సంఘటన దృష్టికి వచ్చినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ హాల్‌లో రౌండ్ వారీగా ఫలితాలను రిటర్నింగ్ అధికారి ప్రకటించేలా చూడాలని, పోలింగ్ ఏజెంట్‌లకు తగిన వసతులు కల్పించాలని సూచించారు. రౌండ్ వారీగా ఫలితాలను ఎప్పటికప్పుడు ఏర్పాటు చేసిన మీడియా కేంద్రంలో పాత్రికేయులకు అందించేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా అధనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, జిల్లా అధికారులు రాజిరెడ్డి, రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ వాసి అబ్దుల్ ఖదీర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ పొందిన అబ్దుల్ ఖదీర్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణ వాసి అబ్దుల్ ఖదీర్‌కు డాక్టరేట్ లభించింది. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఖదీర్ చేసిన ఒక పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లా షికోహబాద్‌లోని జేఎస్ యూనివర్సిటీ ఈ డాక్టరేట్ ప్రదానం చేసింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎల్లంకి ఇంజనీరింగ్ విద్యా సంస్థల చైర్మన్ సదాశివరెడ్డి, డైరెక్టర్ సాంబశివ రెడ్డి, సెక్రటరీ దయాకర్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సాయి కిరణ్, ప్రిన్సిపాల్ జాన్‌పాల్ అభినందించారు. గ్రామీణ ప్రాంతంలో చదువుకున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరేట్ పొందడం తమకు ఎంతో గర్వకారణమని విద్యా సంస్థల చైర్మన్ సదాశివరెడ్డి ప్రశంసించారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఎన్నికల సామగ్రి పంపిణీని పర్యవేక్షిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్

అదనపు రిటర్నింగ్ అధికారి రమేశ్

నర్సాపూర్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా అదనపు కలెక్టర్, అసిస్టెంటు రిటర్నింగ్ అధికారి రమేశ్ తెలిపారు. నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటరులో ఈవీఎంలు ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన బుధవారం పర్యవేక్షించారు. ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు గాను నియోజకవర్గంలో 305 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని, నియోజకవర్గాన్ని 30 రూట్లుగా విభజించామని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం సుమారు రెండు వేల మంది ఉద్యోగులను వినియోగిస్తున్నామని రమేశ్ వివరించారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషా నర్సాపూర్‌లోని ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన మెటీరియల్ పంపిణీ సెంటర్‌ను బుధవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేసి పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

బందోబస్తు పరిశీలించిన ఎస్పీ

ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బందో బస్తును జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పరిశీలించారు. జిల్లా ఏఎస్పీ మహేందర్ దానికి సంబంధించిన వివరాలను ఆమెకు వివరించారు. పోలింగ్ బూత్ వద్ద విధులు నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

ఓట్ల వేట.. నోట్ల వరద

- రెండు రోజుల్లో రూ.కోట్లాది డబ్బు పంపిణీ
- ఒక్కో ఓటరుకు రూ.300 నుంచి రూ.2 వేలు
- పక్కా ప్రణాళికతో ప్రధాన పార్టీలు
- ఏరులై పారిన మద్యం
- మెదక్ కేంద్రంగా నగదు డంప్



మెదక్: కనీవినీ ఎరుగని విధంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల్లో కోట్లాది రూపాయల డబ్బును పంచుతూ నేతలు ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా 28, 29 తేదీల్లో రెండు ప్రధాన పార్టీలకు చెందిన నేతలు పక్కా ప్రణాళికతో పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఓటుకు రూ.300 నుంచి మొదలుకుని రూ.2 వేల వరకు పంపిణీ చేశారు. ఈ తతంగం అంతా మెదక్ జిల్లా కేంద్రంగా కొనసాగింది. నోట్ల కట్టల మూటలను మెదక్‌లో డంపు చేసుకుని అక్కడి నుంచి ఆయా మండలాల సర్పంచులకు అప్పగించినట్లు సమాచారం. ఏ గ్రామంలో ఎన్ని ఓట్లు ఉన్నాయో లెక్కకట్టి దానికి తగ్గట్టు నగదును తరలించినట్టు తెలిసింది. ప్రధాన పార్టీలు మెదక్ పట్టణంలో ఒకరి తరువాత మరొకరు రోడ్‌షోలను నిర్వహించడంతో ఒకపార్టీ బిజీగా ఉన్న సమయంలో మరో పార్టీ నాయకులు డబ్బులను ఆయా గ్రామాలకు తరలించినట్లు సమాచారం. ఒకపార్టీకి చెందిన నేతలు ఓటుకు రూ. 300 చొప్పున పంపిణీ చేయగా మరో పార్టీ నేతలు ఓటుకు రూ.500 నుంచి రూ.2 వేల వరకు ఇచ్చినట్లు పలువురు చెప్పారు. 100 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని కేటాయించి పక్కా ప్రాణాళికతో పంపిణీ చేశారు.

ఏరులై పారిన మద్యం

నగదుతో పాటు మద్యం కూడా ఏరులై పారిందని సమాచారం. 28న జిల్లాకు 750 కాటన్ల లిక్కర్, బీరు బాటిళ్ల పంపిణీ జరిగింది. వాటి విలువ రూ.70 లక్షలు ఉంటుందని అంచనా. ఈ మద్యాన్ని కొల్చారం మండలం చిన్నఘణాపూర్ మద్యం డిపో నుంచి జిల్లాలోని వివిధ వైన్ షాపులకు సరఫరా చేశారు. అయితే మద్యం దుకాణాలకు వెళ్లకుండా పార్టీలకు చెందిన నేతలే డైరెక్టుగా దింపుకునట్లు తెలిసింది.


మెదక్ ముఖచిత్రం

- 1952లో ఏర్పాటు..
- నేటికి 71 ఏళ్లు పూర్తి
- 16 అసెంబ్లీ ఎన్నికలు
- 2,14,556 మంది ఓటర్లు

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల నేపథ్యంలో మెదక్ పరిణామం ఎలా సాగింది? నేటి పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవడం చాలా ముఖ్యం. అందుకే ఈ కథనం.. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఏర్పడగా ఒక ఉప ఎన్నికతో కలిపి 16 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 71 ఏళ్లు నిండిన ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం 7 మండలాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మెదక్ నియోజకవర్గానికి మెదక్, రామాయంపేట, చిన్నశంకరంపేట, పాపన్నపేట మండలాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాను మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలుగా విభజించారు. అనంతరం మండలాల పునర్విభజనలో మెదక్ నియోజకవర్గంలో మూడు మండలాలు పెరిగాయి. ప్రస్తుతం మెదక్ పట్టణం, మెదక్, పాపన్నపేట, రామాయంపేట, చిన్నశంకరంపేట మండలాలతో పాటు కొత్త మండలాలైన హవేళిఘణాపూర్, నిజాంపేట, నార్సింగి మండలాలు ఉన్నాయి.

16 సార్లు అసెంబ్లీ ఎన్నికలు

మెదక్ నియోజకవర్గానికి జరిగిన 16 ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్(5), టీడీపీ(6), బీఆర్‌ఎస్(2), సీపీఐ(1), జనతాపార్టీ(1), ఒక స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. టీడీపీ నుంచి కరణం రామచంద్రరావు నాలుగుసార్లు విజయం సాధించగా, ఒకసారి ఇండిపెండెంట్‌గా నెగ్గారు. ఆయన మరణాంతరం అతడి భార్య కరణం ఉమాదేవి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో రామాయంపేట నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా పద్మాదేవేందర్ రెడ్డి విజయం సాధించారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2008లో తన పదవికి రాజీనామా చేశారు. ఆ తరువాత జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ నేత హనుమంతరావు చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు. అనంతరం 2014, 2018 ఎన్నికల్లో పద్మాదేవేందర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుతం మళ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.



మెదక్ నియోజకవర్గం మ్యాప్

నియోజకవర్గ ఎమ్మెల్యేలు

మెదక్ నియోజకవర్గం ఏర్పడిన 1952 మొదటిసారి అలాగే 1957లో రెండో విడత ఎమ్మెల్యేగా మెదక్ పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు(కాంగ్రెస్ ఐ) ఎన్నికయ్యారు. అనంతరం 1962 కేవల్ ఆనందదేవి(కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా), 1967లో రాజా రామచంద్రారెడ్డి(కాంగ్రెస్), 1972లో కరణం రామచంద్రారావు (ఇండిపెండెంట్), 1978లో శేరి లక్ష్మారెడ్డి, 1983, 1985లో కరణం రామచంద్రారావు(టీడీపీ), 1989లో పట్లోళ్ల నారాయణరెడ్డి(కాంగ్రెస్), 1994, 1999లో కరణం రాంచందర్‌రావు. 2002లో కరణం ఉమాదేవి(టీడీపీ), 2004లో పట్లోళ్ల శశిధర్‌రెడ్డి (జనతాపార్టీ), 2009లో మైనంపల్లి హన్మంతరావు (టీడీపీ), 2014, 2018లో పద్మాదేవేందర్‌రెడ్డి(టీఆర్‌ఎస్) గెలుపొందారు.

ప్రస్తుత పరిస్థితి

నియోజకవర్గంలో మెదక్ పట్టణంతో పాటు 7 మండలాలు, 135 గ్రామాలు, 15 గిరిజన తండాలు ఉన్నాయి. మొత్తం 2,14,556 మంది ఓటర్లు ఉండగా, పురుష ఓటర్లు 102644, మహిళా ఓటర్లు 111908, థర్డ్ జెండర్ నలుగురు ఉన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

పటిష్ట భద్రత

● సిద్దిపేట సీపీ శ్వేత



పోలీసులకు సూచనలిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటఅర్బన్‌: పోలింగ్‌ జరిగిన తర్వాత కౌంటింగ్‌ కేంద్రాల్లో భద్రపరిచే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లకు పటిష్ట భద్రత కల్పించాలని పోలీస్‌ అధికారులకు, సిబ్బందికి పోలీస్‌ కమిషనర్‌ శ్వేత సూచించారు. పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్‌ కళాశాల డిస్ట్రిబ్యూషన్‌ కేంద్రం వద్ద పోలింగ్‌, ఓట్ల లెక్కింపు విధులపై అవగాహన కల్పించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఎన్నికల సామగ్రి రక్షణకు సంబంధించిన పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూట్‌ మొబైల్‌లో ఉన్న పోలింగ్‌ కేంద్రాల వద్ద నిరంతరం పెట్రోలింగ్‌ చేస్తూ ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ సురేందర్‌రెడ్డి, త్రీటౌన్‌ సీఐ భానుప్రకాశ్‌ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి సైక్లింగ్‌ పోటీలకు విద్యార్థులు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): జాతీయ స్థాయి సైక్లింగ్‌ పోటీలకు హుస్నాబాద్‌ విద్యార్థులు ఎంపికయ్యారు. ఆ మేరకు రాంచీలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు ఐలేని వరుణ్‌రెడ్డి, సూరంపల్లి సుమ్మిత్‌, అబ్బరబోయిన రామకృష్ణ, బాలు నిఖిల్‌ వెళ్లనున్నారు.ఈ మేరకు సిద్దిపేట జిల్లా సైక్లింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాస్‌, జంగపల్లి వెంకటనర్సయ్య బుధవారం పేర్కొన్నారు. ఈనెల 5, 6వ తేదీల్లో హైదరాబాద్‌లో ఉన్న ఉస్మానియా వర్సిటీ పరిధిలో వెల్లోడ్రుంలో జరిగిన రాష్ట్ర స్థాయి ట్రాక్‌ సైక్లింగ్‌ పోటీల్లో వారు ప్రతిభ కనబరిచారు. జిల్లా క్రీడల యువజన అభివృద్ధి అధికారి నాగేందర్‌, స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ పాల సాయిరాం, జిల్లా పాఠశాలల సమైక్య కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌ రెడ్డి తదితరులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

రూ.3లక్షల నగదు పట్టివేత

చేర్యాల(సిద్దిపేట): రూ.3 లక్షల నగదును బుధవారం ఫ్లయింగ్‌స్క్వాడ్‌ అధికారులు పట్టుకున్నారు. పట్టణంలోని వీరభద్ర థియేటర్‌ సమీపాన ఉన్న ఒక ఇంట్లో బయటి వ్యక్తులు ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు అధికారులు అక్కడికి వెళ్లి తనిఖీ చేశారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో రూ.3 లక్షలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కరెంట్‌ కాటు

● విద్యుదాఘాతంతో రైతు మృతి



రాంచంద్రం

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలకేంద్రంలో జరిగింది. భూంపల్లి పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. భూంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాంచంద్రం (45) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం అదే గ్రామానికి చెందిన బాల్‌షెట్టి రాజాగౌడ్‌ వ్యవసాయ బావి వద్ద కరెంటు పోల్‌కు కరెంటు తీగలు అమర్చడానికి కూలీ పని కోసం వెళ్లాడు. అక్కడ కరెంటు తీగలు అమర్చుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు 33/11కేవీ కరెంటు తీగలు తగలడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.

14 మందిపై కేసు నమోదు

దుబ్బాకరూరల్‌: పోలీస్‌ విధులకు ఆటంకపరిచిన 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. దుబ్బాకకు చెందిన బీఆర్‌ఎస్‌ కార్యకర్త మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తన కారులో దుబ్బాక వైపు వస్తుండగా చీకోడ్‌ గ్రామం వద్ద అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు అడ్డగించారు. మద్యం, నగదు తరలిస్తున్నారని ఆరోపించారు. సీఐ కృష్ణ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని వాహనాన్ని తనిఖీ చేశారు. ఎలాంటి నగదు, మద్యం లభ్యం కాలేదు. పోలీస్‌ విధులకు ఆటంకపరిచిన వీరిపై సీఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటరన్నా.. మేలుకో..


ఓటు వజ్రాయుధమని మరువకు

● మనల్ని పాలించేవారిని ఎన్నుకునే సమయం ఇదే..

● రాజకీయాల్లోకి యువత రావాలని పిలుపు



నూతన ఓటర్లు



సిద్దిపేట ఎడ్యుకేషన్‌: ఓటరా.. మేలుకో. నీ తలరాత మారాలంటే ఓటే సరైన మార్గం. నువ్వు వేసే ఒక్క ఓటు నీ తలరాతతోపాటు చుట్టూ ఉన్న వారి భవితవ్యం నెలకొంది. ప్రలోభాలకు తలొగ్గక అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే జననేతను ఎన్నుకునే సువర్ణ అవకాశం ఇప్పుడు మీ చేతిలో ఉంది. దీనిపై నూతన ఓటర్లుగా నమోదైన యువత మనోగతం వారి మాటల్లోనే..

ప్రలోభాలకు గురికావద్దు



సమస్యల పరిష్కారానికి మంచి నాయకులను ఎన్నుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. పని చేసే ప్రభుత్వం ఏర్పాటు చేసుకునేందుకు నిజాయితీపరులైన నాయకులను ఎన్నుకోవాలి. ప్రతి పౌరుడూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– తులసి, బీఎస్సీ, జాలపల్లి

ప్రశ్నించే హక్కు ఉండబోదు



యువత ప్రజాస్వామిక సమాజంలో కలిసి ఉన్నప్పుడు దాని మౌలిక అంశాల పట్ల అవగాహనతో పాటు రాజకీయ విలువలను గౌరవించాలి. ఓటు నేటి పౌరసమాజంలో ఉన్న అత్యంత ప్రభావితమైన ఆయుధం. ఓటు వేయని వారికి ప్రశ్నించే హక్కు ఉండదు.

– డాక్టర్‌ గోపాలసుదర్శనం, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ జీడీసీ సిద్దిపేట

పదవుల తొలగింపునకు రీకాల్‌..



ప్రజాస్వామ్యంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక సారి చట్టసభలకు నాయకులను ఎన్నుకుంటున్నాం. ఎన్నికల ముందు ఇచ్చే హామీలను నెరవేర్చి అభివృద్ధి దిశగా పయనింపజేయాలి. అయితే కొన్ని సందర్భాల్లో ఎన్నికైన నాయకులు సరిగా పనిచేయడం లేదు. అలాంటి వారిని వారి పదవుల నుంచి తొలగించేందుకు రీకాల్‌ పద్ధతిని తీసుకురావాలి.

– రాకేశ్‌, బీకాం, గ్రామం మిట్టపల్లి



స్వేచ్ఛగా ఓటు..



పోటీ చేస్తే అభ్యర్థుల ఎన్నికల ఖర్చును తగ్గించాలి. క్షేత్రస్థాయిలో అధికారులు ఎంత ప్రయత్నించినా ఆయా పార్టీల అభ్యర్థులు ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తూనే ఉన్నారు. ఇది సరికాదు. ముఖ్యంగా ఈ విషయంలో యువకులు ప్రజలను చైతన్యం కావాలి. స్వచ్ఛందంగా ఓటు వేయాలి.

– నందిని, బీకాం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేట

అనుభవం, అభివృద్ధికి అందలం



పదవుల్లో ఉండే రాజకీయ నాయకులకు రిటైర్‌మెంట్‌ వయస్సు నిర్ధారించాలి. 80 ఏండ్లు వచ్చినా కూడా పదవుల్లో ఉండాలనుకోవడం సరికాదు. రాజకీయాల నుంచి రిటైర్‌ అయిన వారు యువనాయకులకు అవకాశం కల్పించి వారికి సూచనలు, సలహాలు అందిస్తూ వారి అనుభవాన్ని ప్రజల అభివృద్ధికి ఉపయోగించాలి.

– నవ్య, సిద్దిపేట

చైతన్యవంతులు కావాలి



ప్రస్తుతం రాజకీయాలు అంటే ఒకరకమైన చెడు అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. అయితే దానిని తొలగించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఎన్నికల సమయంలో పలువురు ఓటర్లు ఓటు వేసేందుకు ముందుకు రావడం లేదు ఫలితంగా 100శాతం ఓటింగ్‌ జరగడం లేదు. ఈ విషయంలో యువత ముందుకు వచ్చి అందరినీ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యం చేసి ఆదర్శంగా నిలవాలి. – సాయిప్రణీత్‌, సిద్దిపేట

మనం కూడా అభివృద్ధి చెందాలి



నేను ఓటు హక్కును వినియోగించుకుంటాను అనే భావన నాలో ఎంతో ఉత్సాహాన్ని నింపుతోంది. మొదటిసారి నేను కూడా పాలనలో భాగస్వామ్యం అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఓటర్లు, నాయకులు ప్రజాస్వామిక విలువలను కాపాడాలి. దేశ ప్రయోజనాలను పరిరక్షించుకుంటూనే మనం కూడా అభివృద్ధి చెందాలి.

– భార్గవి, బీఎస్సీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేట

యువతకు పెద్దపీట..



మన దేశంలో యువతీ, యువకుల సంఖ్య అధికంగా ఉంది. యువతరం రాజకీయాల్లోకి రావాలి ప్రజాసమస్యలను అవగతం చేసుకుని వాటిని పరిష్కరించే మార్గాలను అన్వేషించాలి. అన్ని రాజకీయ పార్టీలు యువతకు అవకాశం కల్పించి వారిని ప్రోత్సహించాలి. పనిచేసే ప్రభుత్వాలను ఎన్నుకునేలా ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలి.

– యువరాజ్‌, బీఏ ఫస్టియర్‌, జీడీసీ సిద్దిపేట, గ్రామం హబ్సీపూర్‌

అవగాహన కల్పిస్తా



ఎన్నికల ప్రక్రియలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలి. తమ ప్రాంతాలను ప్రగతివైపు నడిపించే గురుతర బాధ్యతను స్వీకరించాలి. ఆ దిశగా నా వంతు ప్రయత్నం ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఓటు వేయడంతోపాటు ఓటుహక్కుపై మా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తా.

– డేవిడ్‌, బీఏ ప్ర.డిగ్రీ కళాశాల, సిద్దిపేట

ప్రజలు ఓటెత్తాలి



హుస్నాబాద్‌లోని పంపిణీ కేంద్రంలో సోనమ్‌ టెన్సింగ్‌ భూటియా

హుస్నాబాద్‌: ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొని ఓటింగ్‌ శాతాన్ని పెంచాలని జిల్లా ఎన్నికల పోలీస్‌ అబ్జర్వర్‌ సోనమ్‌ టెన్సింగ్‌ భూటియా కోరారు. హుస్నాబాద్‌ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌ను ఆయన బుధవారం సందర్శించారు. పోలీస్‌ అధికారులకు పోలింగ్‌ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు గురించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా భూటియా మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు, క్రిటికల్‌ కేంద్రాల వద్ద బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూట్‌ మొబైల్‌ అధికారులు, ఈవీఎం వీవీప్యాట్‌, ఎన్నికల సామగ్రి రక్షణ బాధ్యత ఉంటుందని చెప్పారు. రూట్‌ మొబైల్‌ అధికారులు వారికి కేటాయించిన రూట్లల్లో 48 గంటల పాటు పెట్రోలింగ్‌ నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రవర్తన నియామవళిని తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో 144 సెక్షన్‌ అమలులో ఉన్నందున ఐదుగురి కంటే ఎక్కువగా గుమికూడవద్దని సూచించారు. డ్రోన్‌ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఏదైన ఫిర్యాదు ఉంటే టోల్‌ ఫ్రీ నంబర్‌ 1950 కాల్‌ చేయాలన్నారు. సీ-విజిల్‌ యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకొని అందులో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ సతీశ్‌, పోలీస్‌ అధికారులు ఉన్నారు.

గజ్వేల్‌లో 321 పోలింగ్‌ కేంద్రాలు



సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి బన్సీలాల్‌

● భారీ బందోబస్తు ఏర్పాటు

గజ్వేల్‌: తెలంగాణలోనే హాట్‌ సీటుగా చెప్పుకుంటున్న గజ్వేల్‌ అసెంబ్లీ సెగ్మెంట్‌ పరిధిలో గురువారం జరగనున్న సాధారణ ఎన్నికల పోలింగ్‌ సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని గజ్వేల్‌, ములుగు, వర్గల్‌, జగదేవ్‌పూర్‌, కొండపాక, కుకునూర్‌పల్లి, మర్కూక్‌, తూప్రాన్‌, మనోహరాబాద్‌ మండలాల్లో మొత్తం 274654 మంది ఓటర్లుండగా ఇందులో 138353 మంది మహిళలు, 136294 మంది పురుషులు, మరో ఏడుగురు ఇతరులు ఉన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో 321 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 202 సమస్యాత్మక పోలింగ్‌ స్టేషన్లను గుర్తించి.. ఆయా కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. పోలింగ్‌ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వెయ్యిమందికి పైగా పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గజ్వేల్‌ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్‌ ఆఫీస్‌ కాంప్లెక్స్‌ వద్ద ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బుధవారం పోలింగ్‌ అధికారులు, సిబ్బంది తమకు అప్పగించిన సామగ్రిని సరిచూసుకొని పోలింగ్‌ కేంద్రాలకు వెళ్లారు. గజ్వేల్‌ ఎన్నిల రిటర్నింగ్‌ అధికారి బన్సీలాల్‌ మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. కాగా పోలింగ్‌ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై జిల్లా అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు, గజ్వేల్‌ ఏసీపీ రమేశ్‌లు పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ఎయిడ్స్‌ రహిత సమాజమే ధ్యేయం

హుస్నాబాద్‌: ప్రపంచ ఎయిడ్స్‌ దినోత్సవాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లెల్లగడ్డ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలురు) ఇంటర్మీడియట్‌ విద్యార్థులకు ఎయిడ్స్‌ రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈసందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్‌ తిరుపతి మాట్లాడుతూ.. జీవితంలో ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ ఎయిడ్స్‌ రహిత సమాజం కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ వాసుదేవ్‌, హెల్త్‌ సూపర్‌వైజర్‌ శ్రీకాంత్‌ అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్‌ తిరుపతి

ఓటు హక్కును వినియోగించుకోవాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్‌ఓ గరిమా అగ్రవాల్‌

దుబ్బాకటౌన్‌: పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దుబ్బాక ఆర్‌ఓ గరీమా అగ్రవాల్‌ అన్నారు. బుధవారం లచ్చపేట మోడల్‌ స్కూల్‌లో ఎన్నికల సిబ్బందికి సామగ్రిని అందించడంతో పాటు సిబ్బందిని కేటాయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 253 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశామని.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

పోలింగ్‌పై వలసల పోటు



బేగంపూర్‌ తండా నుంచి ఖేడ్‌ మీదుగా వలస వెళ్తున్న గిరిజనులు

● కర్ణాటక, మహారాష్ట్ర చెరుకు కర్మాగారాలకు గిరిజనులు

● మూడు నెలలపాటు అక్కడే మకాం

● పిల్లల చదువులు అటకెక్కినట్లేనా?

నారాయణఖేడ్‌: ఓ వైపు ఓట్ల పండగ ముందుండగా పొట్టచేతబట్టుకొని గిరిజనులు మళ్లీ వలస బాట పట్టారు. ప్రతి ఏడూ తరహాలోనే ఈ ఏడాది కూడా బతుకు జీవుడా అంటూ పయనమవుతున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించినా, ఉప ఎన్నికల్లో కర్మాగారాలు ఏర్పాటు చేస్తామని నేతలు హామీలు ఇచ్చినా కార్యరూపం దాల్చకపోవడంతో పేద గిరిజనులకు వలస బాట తప్పడం లేదు. ఈ కారణంగా పోలింగ్‌పై ప్రభావం చూపనుందని పలువురు అంటున్నారు.

ప్రతి ఏడూ వలసలే..

నారాయణఖేడ్‌, అందోల్‌ నియోజకవర్గాలతోపాటు పక్కనే ఉన్న కామారెడ్డి జిల్లాలోని జుక్కల్‌ నియోజకవర్గాల నుంచి గిరిజనులు ప్రతి ఏడూ ఆయా ప్రాంతాల్లోని చెరుకు కర్మాగారాలకు తరలివెళ్తారు. ఖేడ్‌ నియోజకవర్గంలోని మనూరు, నాగల్‌గిద్ద, సిర్గాపూర్‌, కంగ్టి, కల్హేర్‌, నారాయణఖేడ్‌, నిజాంపేట్‌ మండలాలతోపాటు, అందోల్‌ నియోజకవర్గంలోని రేగోడ్‌, అల్లాదుర్గం, వట్‌పల్లి మండలాలు, జుక్కల్‌ నియోజకవర్గంలోని పిట్లం, జుక్కల్‌, నిజాంసాగర్‌ తదితర మండలాల్లోని తండాల నుంచి వలసలు ఉంటాయి. జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్‌, కామారెడ్డి జిల్లా మాగి, నిజామాబాద్‌, కరీంనగర్‌ జిల్లాలోని కర్మాగారాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల్లోని కర్మాగారాలకు కూలీలుగా తరలివెళ్తారు. కర్మాగారంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని కమతాల్లో ఉన్న చెరుకును నరికి కర్మాగారాలకు తరలిస్తారు. తండాల్లో వృద్ధుల వద్ద పిల్లలను వదిలి భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు ఇలా అందరూ చెరుకు నరికేందుకు వెళ్తున్నారు. కొందరు ఇళ్ల వద్ద చూసుకునే వారు లేక చదువుకుంటున్న పిల్లలను సైతం బడిమాన్పించి వెంట తీసుకెళ్తున్నారు. మూడు నెలలపాటు వీరు వలసవెళ్తారు. అన్ని రోజులూ విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిందే.

నెరవేరని హామీ

కర్మాగారాల ఏర్పాటు కోసం ఎన్నికల సమయాల్లో నేతలు ఇచ్చే హామీలు నీటి మీద రాతలు అన్న చందంగానే ఉన్నాయి. గత పార్లమెంట్‌ ఎన్నికల్లో, అంతకు ముందు సైతం ఎన్నికల్లో కర్మాగారాల ఏర్పాటు చేసి వలసలను నివారిస్తానని నాయకులు చెప్పిన హామీలు ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఉప ఎన్నికల్లో సైతం వలసల నివారణ కోసం కర్మాగారాలు నెలకొల్పే విషయంపై ఇచ్చిన హామీ కూడా అమలు కాలేదు. వాటి ఏర్పాటు ప్రాంత వాసులకు కలగానే మారింది. స్థానికంగా చేసుకునేందుకు పనులు లేకపోవడంతో వలస తప్పడం లేదు. చెరుకు కర్మాగారాలు, చెరుకు సాగుచేసిన రైతులతో ప్రాంత గిరిజన కూలీలు చెరుకు నరికేందుకు పంటసాగు సమయంలోనే ముందస్తుగా ఒప్పందం చేసుకోవడంతో ఇప్పుడు వలస వెళ్లక తప్పని పరిస్థితి.

పోలింగ్‌పై ప్రభావం

నారాయణఖేడ్‌, అందోల్‌, కామారెడ్డి జిల్లా జుక్కల్‌ నియోజకవర్గాల్లో గిరిజనులు అధిక సంఖ్యలో ఉంటారు. ఖేడ్‌ నియోజకవర్గంలో 200 వరకు గ్రామాలు ఉండగా అంతే సంఖ్యలో గిరిజన తండాలున్నాయి. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లలో 30 శాతంపైగా గిరిజన ఓటర్లు ఉండనున్నారు. ఇందులో మెజార్టీ గిరిజనులు వలస వెళ్తారు. అందోల్‌, జుక్కల్‌ నియోజకవర్గాల్లోనూ ఓటర్లలో 25 శాతానికి పైగా వారే ఉన్నారు. వలస వెళ్లిన వారు ఓటింగ్‌ సమయాల్లో తండాకు వచ్చి ఓటేసే వారు కొందరు ఉంటారు. సుదూర ప్రాంతానికి వలస వెళ్లిన మరికొందరు ఓటింగ్‌కు దూరం అయ్యే ప్రమాదం ఉంది. అధికారులు గిరిజనుల ఓటింగ్‌ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే.

వీలుంటే ఓటేస్తా



సదాశివపేట పరిధిలోని ఆత్మపూర్‌లో చెరుకు తోటల్లో చెరుకు నరికి సంగారెడ్డిలోని కర్మాగారానికి తరలించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వలస వెళ్తున్నా. పిల్లాపాపలను సైతం తీసుకెళ్తున్నా. మూడు నెలలపాటు పనులు చేస్తా. ఓటింగ్‌ రోజు వీలుంటే వస్తా..

– రాములు చౌహాన్‌, బేగంపూర్‌ తండా, పిట్లం మండలం

చెరుకు కర్మాగారానికి వెళ్తున్నా..



సంగారెడ్డిలోని చెరుకు కర్మాగారానికి వెళ్తున్నా. మూడు నెలలపాటు కూలీ పనులు చేస్తాం. ఎన్నికలు వచ్చాయి. ఓటింగ్‌కు దూరం అయ్యే పరిస్థితి ఉంది. ఎవరైనా తోడు వస్తే వచ్చి ఓటేసేందుకు వస్తా.. లేదా అక్కడే కూలీ పనులు చేసుకుంటా.

– శివరాంనాయక్‌, బేగంపూర్‌ తండా, పిట్లం మండలం



నారాయణఖేడ్‌లో..



నర్సాపూర్‌లో..



జహీరాబాద్‌లో..

విధులకు వేళాయే...

ఉమ్మడి మెదక్‌ జిల్లాలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పంపిణీ కేంద్రాలకు చేరుకున్న సిబ్బందికి అధికారులు సామగ్రిని అందజేశారు. అనంతరం బస్సుల్లో తమకు కేటాయించిన ప్రాంతాలకు పయనమయ్యారు.

– సాక్షి, నెట్‌వర్క్‌